ఏలూరు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే ఆళ్ల నాని



40వ డివిజన్‌లో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని



41వ డివిజన్‌లో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్,ఇడా చైర్మన్ బొద్దాని

ఏలూరు టౌన్: ఏలూరు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. నగరంలోని 40, 41, 42, 43 డివిజన్ల పరిధిలో రూ.2.91 కోట్ల వ్యయంతో 29 సీసీ రోడ్లు, 24 డ్రెయినేజీలు, 6 కల్వర్టులు, ఒక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని శంకుస్థాపన చేశారు. 40వ డివిజన్‌లో రూ.57.61 లక్షలతో 9 సీసీ రోడ్లు, 6 డ్రెయినేజీలు, 41వ డివిజన్‌లో రూ.54 లక్షలతో 5 సీసీ రోడ్లు, 6 డ్రెయినేజీలు, ఒక కమ్యూనిటీ హాలు ఆధునికీకరణ, 42వ డివిజన్‌లో రూ.90 లక్షలతో 5 సీసీ రోడ్లు, 4 డ్రెయినేజీలు, 5 కల్వర్టులు, 43వ డివిజన్‌లో రూ.87.23 లక్షలతో 10 సీసీ రోడ్లు, 8 డ్రెయినేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీగా నిధులు మంజూరు చేశారని వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిధులు రూ.31 కోట్లు ఖర్చు చేయడంతో పాటు నగరపాలక సంస్థ సాధారణ నిధులు సైతం వెచ్చించి ప్రతి ప్రాంతంలోనూ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమాల్లో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ క్లస్టర్–3 అధ్యక్షులు మంచెం మైబాబు, 40వ డివిజన్ కార్పొరేటర్, పార్టీ క్లస్టర్–1 పార్టీ మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి, 41వ డివిజన్ కార్పొరేటర్ ఈదుపల్లి కళ్యాణి, 42వ డివిజన్ కార్పొరేటర్ ఆర్ది సత్యవతి, 43వ డివిజన్ కార్పొరేటర్ జనపరెడ్డి కనక శ్రీరాజేశ్వరి, నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా, పార్టీ నాయకులు మజ్జి కాంతారావు, పార్టీ మహిళా కార్యదర్శి మహబూబ్ ఉన్నీసా తదితరులున్నారు.

క్లుప్తంగా

యాదవ సంఘం భవన నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న భట్రాజు శివాజీ

ఏలూరు (టూటౌన్): ఏలూరులో నిర్మిస్తోన్న అఖిల భారత యాదవ సంఘం జిల్లా, నగర కార్యాలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ కైకలూరు మండల నాయకులు తామరకొల్లు సర్పంచ్ భట్రాజు శివాజీ రూ.లక్ష విరాళం అందజేశారు. కైకలూరు ఏఎంసీ చైర్మన్, నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు చేబోయిన వీర్రాజు చేతుల మీదుగా ఏలూరు జిల్లా యాదవ సంఘం నాయకులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీకి జిల్లా యాదవ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, నాయకులు బొట్టా అజయ్, బోయిన చంద్ర శేఖర్, గడిదేసి సింహాచలం, పాట్టేలు పెంటయ్య, కింజరి నాగరాజు, హనుమంతరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గొర్రెలు, మేకల పెంపకందార్ల సంమాఖ్య అధ్యక్షుడు ఆగొల్లు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను చూపుతున్న న్యాయవాదులు

ఏలూరు (టూటౌన్): అంబేద్కర్ ఆలోచన ఫెడరేషన్ 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఏలూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అడ్వకేట్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పినిపే వెంకట రామకృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో న్యాయవాదులు క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు రత్నరాజు, ఏలూరు పార్లమెంటు కార్యవర్గం అధ్యక్షుడు గోధుమ తిరుపతి స్వామి, సంయుక్త కన్వీనర్ బోడపాటి బెన్ని క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏలూరు బార్ ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు పాల్గొన్నారు.

జూద క్రీడలకు దూరంగా ఉండండి

ఏలూరు(మెట్రో): ఏలూరు డివిజన్‌లో కోడి పందేలు, గుండాట మొదలగు జూదక్రీడలు నిషేదమని ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. సాంఘిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, నిర్వహించే ప్రదేశాల సమాచారం వెంటనే సంబంధిత తహసీల్దార్ లేదా స్టేషన్ హౌస్ ఆఫీసర్ లేదా వీఆర్వో లేదా పంచాయతీ కార్యదర్శి తెలియజేయాలని కోరారు. సంక్రాంతి పండుగను బంధువులు, కుటుంబ సభ్యులతో ఆనందంగా నిర్వహించుకోవాలని సూచించారు. యువత క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని తల్లిదండ్రులను వేదనకు గురి చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

కోడిపందేలకు అనుమతి లేదు

డీఎస్పీ శ్రీనివాసులు



ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో కోడిపందేలకు, పేకాట శిబిరాల నిర్వహణకు అనుమతులు లేవని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు తెలిపారు. ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ మూడు రోజులు పాటు ఏలూరు సబ్‌డివిజన్‌లో పేకాట, కోడిపందేలకు అనుమతులు ఉన్నాయంటూ చేస్తోన్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని ఆయన తెలిపారు. కోడిపందేలు నిర్వాహకులు, కోడికత్తుల తయారీదారులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. కోడిపందేలు నిర్వహణపై నిఘా పెంచామని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఏలూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో గత 10 రోజుల్లో 673 బైండోవర్ కేసులు నమోదు చేసి 1102 మందిని ఏలూరు నగర తహసీల్దార్ కోర్టులో హాజరుపరిచి పూచీకత్తు తీసుకున్నామని చెప్పారు. సబ్‌డివిజన్ పరిధిలో 39 పేకాట కేసులు నమోదు చేసి 231 మందిని అదుపులోకి తీసుకుని రూ.4,39,950 స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. నాటుసారా తయారీ, రవాణాపై నిఘా పెంచి కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై డయల్ 100, 112 లేదా ఫోన్ నెంబర్ 83329 59175కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

టీడీఎస్ చెల్లింపులపై అవగాహన అవసరం

ఆదాయపు పన్నుశాఖ అధికారి శ్రీనివాసరావు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టీడీఎస్ పన్నుల చెల్లింపుపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆదాయపు పన్ను శాఖ (టీడీఎస్) అధికారి నండూరి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో ఏలూరు జిల్లా సహకార అధికారులకు మూలం వద్ద పన్ను (టీడీఎస్) మినహాయింపుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ నిర్మాణంలో టీడీఎస్ పాత్ర ప్రాముఖ్యమైనదన్నారు. వేతనాల చెల్లింపు, కాంట్రాక్టర్లకు చేసే చెల్లింపులు, నగదు ఉపసంహరణలో, వడ్డీ చెల్లింపుల్లో మినహాయించాల్సిన టీడీఎస్ రేట్లను వివరించారు. టీడీఎస్ చేసిన మొత్తాన్ని సకాలంలో ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలని, త్రైమాసిక టీడీఎస్ స్టేమెంట్లను సకాలంలో దాఖలు చేయాలని సూచించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.శ్రీదేవి, ఇన్‌కం టాక్స్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రావణి, ఓఎస్ ఆర్ తార, డీసీసీబీ బ్రాంచ్‌ల డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ఏజీఎంలు, మేనేజర్‌లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత న్యాయ సాయం



వృద్ధుల యోగ క్షేమాలు తెలుసుకుంటున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): వృద్ధులకు అవసరమైన ఉచిత న్యాయ సాయం జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందజేస్తుందని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక మాదేపల్లిలోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు అందుతున్న వసతులు, వారికి అందుతోన్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వృద్ధుల కుటుంబ విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారికి వృద్ధుల చట్టాలు, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. పథకాలు పొందడంలో లేదా ఇతర అంశాల్లో న్యాయ సాయం అవసరమైతే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం మేనేజర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం



రోగులకు మెడికల్ రిపోర్ట్ అందిస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు రూరల్ : వైఎస్సార్ ఆరోగ్య సురక్ష పేదలకు వరం వంటిదని 15 డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. బుధవారం డివిజన్‌లో ఆరోగ్యశాఖ అధికారులు రెండో దఫా ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎనలేని సేవలు అందుతున్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఖరీదైన వైద్య సేవలు, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రతి కుటుంబానికి ఇంటి వద్దకే వైద్యుల పర్యవేక్షణ, ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలు అందరికీ వైద్య సేవలు అందడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్టీప్లెక్స్ ఏర్పాటు శుభపరిణామం



మాట్లాడుతున్న సినీ నిర్మాత దిల్ రాజు, చిత్రంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మెట్రోస్థాయి నగరాలకే పరిమితమైన మల్టీ ప్లెక్స్‌లను ఏలూరు నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక కొత్త బస్టాండు వద్ద నిర్మించిన సీఎంఆర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌వీసీ సినిమాస్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సినీ నిర్మాత దిల్ రాజు, జేసీ బి.లావణ్యవేణి, సీఎంఆర్ రమణ, నిర్మాత అంబికా కృష్ణ తదితరులు మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు



ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో క్రీడాకారులను పరిచయం చేస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ



చాటపర్రులో పోటీలను ప్రారంభించిన ఎంపీడీఓ ప్రణవి



కోమటిలంక వాలీబాల్ జట్టు



మాదేపల్లిలో బ్యాడ్మింటన్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఏలూరు రూరల్ : ఆడుదాం ఆంధ్ర రెండోదశ ఆటల పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు నగర కార్పొరేషన్ అధికారులు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహించగా, ఏలూరు రూరల్ మండల పరిషత్ అధికారులు గ్రామాల్లో మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నగర కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ పోటీలు ప్రారంభించారు. ముందుగా వ్యాయామ ఉపాధ్యాయులు 79 సచివాలయాలకు చెందిన జట్లు 3 క్లస్టర్స్‌గా విభజించి పోటీల డ్రా వేశారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు పోటీలను పరివేక్షించారు. పీఈటీలు కె.మురళీకృష్ణ, మురళీకృష్ణ, భోగలింగేశ్వరరావు, పీలా గోపీ, ప్రసన్న, రమేష్ తదితరులు కబడ్డి, క్రికెట్ పోటీలు నిర్వహించారు. రూరల్ మండలం చాటపర్రులో వాలీబాల్ పోటీలను ఎంపీడీఓ బి.ప్రణవి ప్రారంభించారు. మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో బ్యాడ్మింటన్, చాటపర్రు, గుడివాకలంక పాఠశాలల్లో వాలీబాల్, సర్ సీఆర్‌ఆర్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పీఈటీలు పోటీలు నిర్వహణలో భాగస్వాములయ్యారు. మొత్తంగా రెండో దశ ఆటల పోటీలు సుమారు 15 రోజుల పాటు నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు.

అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తి



ప్రతిజ్ఞ చేస్తున్న నగర కమిషనర్ వెంకటకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, డిప్యూటీ మేయర్

ఏలూరు టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సామాజిక న్యాయ శిల్పం పేరుతో సీఎం జగన్ ఆవిష్కరించనున్నారని తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఏలూరులోని విద్యార్థులు, యువతకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాల సాధన, సామాజిక న్యాయ మార్గంలో నడుస్తామంటూ నాయకులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కోఆప్షన్ సభ్యులు పెదబాబు మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను ఆచరిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, మెప్మా పీడీ ఇమ్మానియేల్, పీఓ కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, నాయకులు విజయకుమార్ జైన్, పాము శామ్యూల్, నగరపాలక సంస్థ సిబ్బంది ఉన్నారు.

మైనర్లకు మోటారు సైకిళ్లు ఇవ్వొద్దు



మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏలూరు ట్రాఫిక్ ఎస్సైలు

ఏలూరు టౌన్: మైనర్లు మోటారు సైకిళ్ల ఇవ్వటం వల్ల రోడ్డు ప్రమాదాలు, అనర్థాలకు దారితీస్తోందని, తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని ఏలూరు ట్రాఫిక్ ఎస్సైలు శ్రీధర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు సూచించారు. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం మైనర్లకు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మోటారు సైకిళ్లు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు మోటారు సైకిళ్ల ఇవ్వటం చట్ట విరుద్ధమని అన్నారు. మైనర్లకు వాహనాలిస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా మోటారు సైకిళ్లు నడుపుతూ ప్రమాదాలకు గురైతే వాహన యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.

13 నుంచి సంక్రాంతి సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న నారా శేషు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జూట్ మిల్ వద్ద ఉన్న ధర్మభేరీ ప్రాంగణంలో ఈనెల 13వ తేదీ నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు వ్యాపారవేత్త నారా శేషు తెలిపారు. స్థానిక ధర్మభేరి ప్రాంగణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు రంగోలి ముగ్గుల పోటీలు, 14న ఉదయం నాలుగు గంటల నుంచి భోగి సందర్భంగా చిన్నారులకు భోగి పండ్లు పోసేవేడుక, 15వ తేదీ సంక్రాంతి పండుగ రోజున మధ్యాహ్నం రెండు గంటల నుంచి యువతకు ఎగిరే పతాంగ్ పేరిట గాలిపటాల పోటీలు నిర్వహిస్తామన్నారు. ముగ్గుల పోటీలో కేటగిరిలో 25 సంవత్సరాలు పైబడిన విభాగంలో గెలిచిన మహిళా విజేతలకు మొదటి బహుమతిగా 32 ఇంచ్‌ల కలర్ టీవీ, రెండో బహుమతిగా వాషింగ్ మిషన్, మూడో బహుమతిగా మైక్రో వేవ్ ఓవెన్ అందిస్తామని తెలిపారు. రెండో కేటగిరిలో 15 నుంచి 25 సంవత్సరాల్లోపు విభాగంలో విజేతలకు మొదటి బహుమతిగా ట్యాబ్, రెండో బహుమతిగా డిజిటల్ వాచ్, తృతీయ బహుమతిగా ఇన్‌స్టా కెమెరా బహుమతులుగా అందిస్తామని వెల్లడించారు. 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే గాలిపటాల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా ట్యాబ్, రెండో బహుమతిగా డిజిటల్ వాచ్, మూడో బహుమతిగా ఇన్‌స్టా కెమెరా అందిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ధర్మభేరి ప్రాంగణంలో తమ పేర్లు నమోదు చేయించుకోవచ్చని, ఇతర వివరాలకు సెల్ నెంబర్ 99661 29599కు సంప్రదించాలని శేషు కోరారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహాలు



కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు (సప్తాహాలు) భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక, భక్తి సంగీత, కూచిపూడి నృత్య కార్యక్రమాలు అలరించాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం, స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం తాళ్లపూడికి చెందిన తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రి (జూనియర్ ఉపశ్రీ) శ్రీమద్రామాయణ మహత్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. నగరానికి చెందిన రేవతి రామ్‌కుమార్ బృందం నిర్వహించిన ఘంటసాల భక్తి సంగీత విభావరి వీనుల విందు చేసింది. రాత్రి బంగారు బృంద ఆధ్వర్యంలో ఆమె శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సమస్యల పరిష్కారానికి ఆదేశం

ఏలూరు(మెట్రో): ఏలూరు నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సమస్యలు నిబంధనల మేరకు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్మికుల సమస్యలను కమిషనర్, ఏఐటీయూసీ నాయకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో పరిష్కరించదగిన సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి అంశాలను సంబంధిత శాఖకు పంపాలని కలెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణను ఆదేశించారు. కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ, హెల్త్ ఆఫీసర్ మాలతి, ఏఐటీయూసీ ఏలూరు కార్యదర్శి ఎ.అప్పలరాజు, ట్రెజరర్ బి.నారాయణరాజు, జాయింట్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్‌లు పాల్గొన్నారు.